ప్రజాశక్తి

మంగళవారం 22 జులై 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు





తొలగిన వర్షాభావం

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎడతెరిపిలేని వాన
- సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు
- భారీ వర్షంతో పొంగిన వాగులు
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వానతో జనజీవనానికి అంతరాయం కలిగింది. పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రహదారులు దెబ్బతింటున్నాయి. మరో రెండ్రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చలిగాలులు వీస్తున్నాయి.

40 రోజులుగా వర్షాలు లేక అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. ప్రధానంగా ఖరీఫ్ సాగుకు సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావంతో పంటలను సాగు చేసేందుకు వెనుకంజ వేసిన రైతులు ఈ వర్షాలు తగ్గగానే సాగుకు సిద్ధం అవుతున్నారు. వర్షాభావంతో 40 రోజులు ఆలస్యం అయినా ఇబ్బంది ఏమీ లేదని సాగు మళ్లీ వేగం పుంజుకుంటుందని అధికారులు తెలిపారు. ప్రధానంగా పత్తి, వరి, మిర్చి,కంది, శనగ, చిరుధాన్యాల సాగుకు సానుకూల వాతావరణం ఉంది. మరో వారం రోజుల్లో నాగార్జున సాగర్ జలాశయం పూర్తిగా నిండే అవకాశం ఉండటంతో ఇక నీటి ఎద్దడి కూడా ఉండదని అధికారులు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుత వర్షాలకు పంటలు వేసుకోవడానికి ఉపయోపడుతుందని, ఒకవేళ మళ్లీ 20 రోజుల తరువాత వర్షాలు రాకపోయినా కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు విడుదలయ్యే అవకాశ ఉండటం వల్ల నీటి ఎద్దడి అనే సమస్య ఉత్పన్నం కాదని అధికారులు చెబుతున్నారు.

నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా సోమవారం సాయంత్రం 6 గంటలకు 568.20 అడుగుల వద్ద నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం సాగర్ జలాశయంకు ఎగువ నుంచి 58,495 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రస్తుతం ▶ 2లో



పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలోని ఒ ఇంట్లోకి వచ్చిన వర్షపునీరు



ప్రత్తిపాడు మండలంలో నీట మునిగిన పొగాకు

వాననీరు.. పొగాకు రైతు కన్నీరు..

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రోజుల తరబడి వానం రైతుల కళ్లల్లో నీరు తెప్పిస్తోంది. రైతులు ఎక్కువగా వేసిన పొగాకును అమ్ముకోవడానికి నానా తంటలు పడుతున్న నేపథ్యంలో తాజా వాన పొగాకు అంతటినీ ముంచేసింది. ప్రత్తిపాడు, తిమ్మాపురం, వంగిపురం, పాత మల్లాయపాలెం గ్రామాల్లో గత ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పొగాకు ఇప్పటికీ పొలాల్లోనే ఉంది. అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన సందర్భంలో కొంటామని చెబుతున్న బయ్యర్లు తీరా పంటను రైతులు తీసుకెళ్లాక నాణ్యత లేదంటూ తిరస్కరిస్తున్నారు. దీంతో రైతులు తమ పొగాకును పొలాల్లోనే ఉంచగా ఈ నేపథ్యంలో ఐదురోజులుగా రోజూ కురుస్తున్న వాన పొలాలను ముంచెత్తి రైతు కళ్లల్లో నీళ్లు నింపింది.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలో మూడ్రోజులుగా ఎడతెరిపి లేని వానలతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వెద పద్ధతిలో వేసిన వరి విత్తనాలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.6 వేలు ఖర్చుచేసిన రైతులు ఇప్పుడు వాన నీటిని పొలాల నుండి బయటకు పంపడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇదేరీతిలో వర్షం కొనసాగితే లేత దశలో ఉన్న నారు సైతం కుళ్లిపోతుందని రైతులు ఆందోళనపడుతున్నారు. గతేడాది ▶ 2లో



దుగ్గిరాల మండలంలో పొలంలో నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న రైతు



నివాళులర్పిస్తున్న నాయకులు

అచ్యుతానందన్ మృతి అభ్యుదయ ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి-గుంటూరు

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం అగ్రనేత అచ్యుతానందన్ మృతి కేరళ రాష్ట్రానికే కాక, దేశంలో అభ్యుదయ ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. విఎస్.అచ్యుతానందన్ సంస్మరణ సభ బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వంచారు. అచ్యుతానందన్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ మాట్లాడుతూ అచ్యుతానందన్ తన జీవితాంతం కష్టజీవుల అభ్యున్నతికి, కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను లక్ష్యాలను కొనసాగించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రామారావు మాట్లాడుతూ అచ్యుతానందన్ తొలితరం కమ్యూనిస్టు నాయకులని, కేరళ సిపిఎం నిర్మాణంలో, అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. మూడుసార్లు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అతివాద, మితవాద విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పోరాడి సిపిఎంను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కేరళలో మతోన్మాద కార్పొరేట్ శక్తులకు, మరోవైపు కాంగ్రెస్ పార్టీ అవకాశవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. దేశంలో కుల, మత, విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలో అచ్యుతానందన్ మరణించడం తీరని లోటని, ఆయన ఆశయాలను నేటి తరం కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు ఇ.అప్పారావు. ఎన్.భావన్నారాయణ, బి.లక్ష్మణరావు, వి.వి.కె. సురేష్, కె.పద్మ, ఎ.కళ్యాణి, కె.నాగేశ్వరావు, కాపు శ్రీనివాస్, ఎస్.పద్మ, సమీర్, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో అచ్యుతానందన్‌కు నివాళి

ప్రజాశక్తి - విజయవాడ



కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పూర్వ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్‌కు నివాళి అర్పించే కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు నగరంలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొంటారు.

ఆక్టోబర్ 6, 7 తేదీల్లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

సత్తెనపల్లిలో నిర్వహణకు నిర్ణయం - పలు అంశాలపై తీర్మానాలు ఆమోదం

పే-2





తెనాలిలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

యాప్‌ల రద్దు కోసం అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అంగన్వాడీల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీలో పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్, ఓటీపీ, ఇకెవైసి తదితర నిబంధనలను తొలగించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. గతంలో మాదిరి లబ్ధిదార్ల సంతకాలతో సరుకులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆందోళనలు చేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని సిడిపిఒ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపి సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ సరుకులు ఇచ్చేటప్పుడు అంగన్వాడి వర్కర్ ఫొటోతో పాటు, లబ్ధిదారులకు ఫొటోలు తీయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, అయితే ఫోన్లు సరిగా పని చేయకపోవడం, ఇంటర్నెట్ సిగ్నల్స్ సమస్య వల్ల రెండు మూడు గంటలు పడుతోందని, దీంతో లబ్ధిదార్లు విసిగిపోతున్నారని, అంగన్వాడీలు మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు 90 శాతం పాడయ్యాయని, యాప్‌ల నిర్వహణకు అనుగుణంగా వేగం, నెట్ సదుపాయంలేక ఆన్‌లైన్ ప్రక్రియ కష్టంగా మారిందని, మరోవైపు ప్రీస్కూల్ నిర్వహణా దెబ్బతింటోందని అన్నారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైతేనే ▶ 2లో

ఆక్టోబర్ 6, 7 తేదీల్లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

సత్తెనపల్లిలో నిర్వహణకు నిర్ణయం - పలు అంశాలపై తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను అక్టోబర్ 6, 7 తేదీల్లో సత్తెనపల్లిలో నిర్వహిస్తామని సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ ప్రకటించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం కె.శివదుర్గారావు అధ్యక్షతన సత్తెనపల్లిలో సోమవారం నిర్వహించగా పలు తీర్మానాలను ఆమోదించారు. వివరాలను బాలకృష్ణ వెల్లడించారు. చేనేత రంగాన్ని పరిరక్షిస్తామని, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుదలకు చర్యలు చేపడతామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన కూటమి వాటిని విస్మరించిందన్నారు. ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన త్రిఫ్ట్ ఫండ్ రూ.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు రావాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ,రిబేట్ మొత్తం రూ.156 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. వచ్చేనెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ ఆదరణ పథకానికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి రూ.వెయ్యికోట్లే కేటాయించారని, ఇందులోనూ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. సామాజిక రక్షణ చట్టంలో కొన్ని వృత్తులకు రక్షణ కల్పిస్తానని చెప్పి 8 మంది మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినా ఆ కమిటీ ఇప్పటివరకు ఏ విధమైన చర్యలూ చేపట్టలేదన్నారు. 56 కార్పొరేషన్లకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం మాదిరే ప్రస్తుత కూటమి ప్రభుత్వం 56 మంది ఛైర్మన్లను నియమించిందని, ఒక్కొక్కరికి నెలకు రూ.రెండు లక్షల జీతం, 729 డైరెక్టర్లకు ఒక్కో డైరెక్టర్‌కు నెలకు రూ.12 వేల గౌరవ వేతనం ఇస్తున్నా కార్పొరేషన్లకు విధివిధానాలు రూపొందించని కారణంగా వృత్తిదారులకు ప్రయోజన మేమీ లేదని విమర్శించారు. ఈ సమస్యపై వృత్తిదారు లందర్నీ ఐక్యం చేసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు డి.రామారావు, వి.గంగాధరరావు, ఎ.వీరబ్రహ్మం పాల్గొన్నారు.



యాప్‌ల రద్దు కోసం అంగన్వాడీల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

సరుకులు వస్తాయంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ఇదే కొనసాగితే లబ్ధిదార్లు, పిల్లల సంఖ్య తగ్గుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రీస్కూల్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమలత, ఎ.పద్మ, నాయకులు నగరాజకుమారి, శ్రీవాసవి, శశికళ, శివపార్వతి, నవరత్నమణి, విజయ, వి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి సిడిపిఒ విజయ గౌరీకి వినతిపత్రం ఇచ్చారు. అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటరుకు ఒకే యాప్ ఉండాలని, 2022లో అంగన్వాడిలకు కేటాయించిన ఫోన్లు సరిగ్గా పనిచేయని కారణంగా ఓటిపి, కెవైసి సందేశాలు అధికారులకు పంపించడం ఆలస్యం అవుతోందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్, డివిజన్ కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి, అంగన్వాడీ నాయకులు పి.విజయలక్ష్మి, షేక్ హసీనా బేగం, లావణ్య, సునీత, సుజాత, కనకదుర్గ, ఎన్.పావని, నిర్మల, కె.రాధిక, జరీన బేగం పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తాడికొండ : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపి తహశీల్దార్ మెహర్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్‌రావు మాట్లాడారు. రైతుసంఘం నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు మద్దతు తెలిపారు.



ప్రజాశక్తి - ఫిరంగిపురం : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఫిరంగిపురం సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు విజయ నందిని, సన్నీ, మంజుల, అల్లాబి, లక్ష్మి, అభిలా పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభంలో జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలోని పేదలు, అల్పాదాయ వర్గాలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఎంతో పురోగతి సాధించిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 150 పీహెచ్‌సీలు ప్రారంభించడం రాష్ట్ర ఆరోగ్య రంగం అభివృద్ధికి కీలకమైన దశగా పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నిత్యం బిల్లులు చెల్లిస్తోందని, ప్రజల ఆరోగ్యభద్రతే తమ లక్ష్యమన్నారు. 2027 నాటికి రాష్ట్ర సగటు ఆయుర్దాయం 86 ఏళ్లకు పెంచాలన్నదే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొలగిన వర్షాభావం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. త్వరలో కుడికాల్వలకు కూడా నీరు విడుదల చేయనున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉంది. కృష్ణా, ఖమ్మం జిల్లాల క్యాచ్‌మెంట్‌తోపాటు పులిచింతల దిగువ కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజికి వరద వస్తోంది. దిగువకు 10,755 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గుంటూరు జిల్లా మొత్తం మీద ఈఏడాది ఖరీఫ్‌లో 2.25 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 22వేల ఎకరాలు సాగైంది. పల్నాడు జిల్లాలో 4.5 లక్షల విస్తీర్ణంలో సాగు చేయాల్సి ఉండగా ఈనెల 16 వరకు 32 వేల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. సత్తెనపల్లి, ముప్పాళ్ల, పెదకూరపాడు, రాజుపాలెం, నరసరావుపేటలో సోమవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. మిగతా మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. మిగతా ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. మొత్తంగా ఈ వర్షం మరో రెండు రోజులు కొనసాగితే వచ్చే వారంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పత్తి, డెల్టాలో వరిసాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. గుంటూరు నగరంలో సోమవారం కూడా కుండపోతగా వర్షం కురిసింది.

గుంటూరు జిల్లాలో జులైలో 164.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సోమవారం వరకు 145.2 మిల్లీ మీటర్లు, పల్నాడు జిల్లాలో 88.7 మిల్లీ మీటర్లకు గాను 71.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. ప్రస్తుతానికి అవసరం మేరకు వర్షం కురిసిందని అధికారులు చెబుతున్నారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, తెనాలి, చేబ్రోలు, మంగళగిరి, తాడికొండ, తుళ్లూరు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో కొండవీటి వాగు ప్రవాహం ప్రారంభమైంది. పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పాలవాగు, కోటేళ్ల వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదనంది పాడు-ప్రత్తిపాడు మధ్య చప్టాలపై నీరు రావడంతో గుంటూరు-పర్చూరు మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షానికి గుంటూరు మిర్చి యార్డులో రైతులు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. మిర్చి బస్తాలు తడవకుండా నానా తంటాలు పడ్డారు. ప్రత్తిపాడు మండలంలో పొగాకు పంట నీట మునిగింది.

ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
వట్టిచెరుకూరు	110.2
కాకుమాను	86.2
గుంటూరుతూర్పు	82.4
గుంటూరు పశ్చిమ	80.2
కొల్లిపర	67.2
ప్రత్తిపాడు	55.6
పెదనందిపాడు	53.6
దుగ్గిరాల	48.6
తాడికొండ	45.0
ఫిరంగిపురం	38.4
పెదకాకాని	37.8
చేబ్రోలు	36.2
తుళ్లూరు	36.2
తాడేపల్లి	32.4
తెనాలి	22.8
మేడికొండూరు	13.6

పల్నాడు జిల్లాలో వర్షపాతం వివరాలు

దుర్గి	89.0
నాదెండ్ల	55.4
నరసరావుపేట	51.2
రొంపిచర్ల	47.2
మాచర్ల	46.0
అమరావతి	45.2
రాజుపాలెం	42.8
క్రోసూరు	39.8
చిలకలూరిపేట	39.2
సత్తెనపల్లి	38.2
బెల్లంకొండ	36.6
ముప్పాళ్ల	36.4
పెదకూరపాడు	35.2
రెంటచింతల	21.2

బుడంపాడు పిఎసిఎస్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణీస్వీకారం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలోని బుడంపాడు పిఎసిఎస్ ఛైర్మన్‌గా శ్రీమన్నారాయణ, డైరెక్టర్లుగా ఓగిపోయిన వెంకటేశ్వరమ్మ, ఏటుకూరి బాలశౌరి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరికి నియామక పత్రాలను ఎమ్మెల్యే బి.రామాంజనేయులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి కాల్వల మరమత్తులు పనులు నూరు శాతం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేసి సరైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిడిసిఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన కో-ఆర్డినేటర్ కొరపాటి నాగేశ్వరరావు, జనసేన నాయకులు వడ్రాణం మార్కండేయ బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, తెలుగు రైతు రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అమోఘం : డీఎస్పీ

ప్రజాశక్తి - మంగళగిరి

సమాజాభివద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని మంగళగిరి డిఎస్పీ మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులకు లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు హెల్త్ కార్డులను ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలు నందు సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డిఎస్పీ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా కార్యదర్శి కే రాంబాబు అధ్యక్షత వహించారు. డి.ఎస్.పి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి జర్నలిస్టులు విశేషమైన కషి చేస్తున్నారని అభినందించారు.అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ, నన్నపనేని నాగేశ్వరరావు లను యూనియన్ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు జొన్న వెంకటేష్, కార్యదర్శి బత్తుల సాంబశివరావు (సాంబ), ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భక్తవత్సలం, ఐజేయూ సభ్యులు మార్కండేయులు, కోశాధికారి ఫణీంద్ర, ఏపీయూడబ్ల్యూజే తెనాలి అధ్యక్షులు చందు సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు తాడిబోయిన నాగేశ్వరరావు, జొన్న రాజేష్, జిల్లా నాయకులు సింహాద్రి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

వాననీరు.. పొగాకు రైతు కన్నీరు..

(మొదటి పేజీ తరువాయి)

కూడా వర్షంభారిన పడి రెండుసార్లు విత్తనాలు వేయాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. మేజర్ పంచాయతీ రెంటచింతలలోనే శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద ఉన్న సిసి రోడ్లన్నీ మోకాల్లోతు నీళ్లలో ఉన్నాయి. పశు వైద్యశాల నిండా వర్షపు నీరు చేరింది. గ్రామంలోని చెత్తాచెదారం కొట్టుకొచ్చి ఈ ప్రాంతంలో మేట వేసిం దుర్గంధం వెదజల్లుతోంది. సైడ్ కాలువలు నిండా మట్టి చేరడంతో మురుగునీరు బయటకు పోయే అవకాశం లేక భారీ వర్షం కురిసినప్పుడల్లా ఇదే దుస్థితి తప్పడం లేదు. ఆదివారం రాత్రి 20 మిల్లీమీటర్ల వర్షం సోమవారం సాయంత్రం 40 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో కుండపోత వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నేపథ్యంలో డ్రైయినేజీ కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. నాగమ్మకుంట ప్రాంతంలో ఇళ్లలోకి మురుగునీరు చేరింది. వృద్ధులు కూడా కొట్టుకు రావటంతో అక్కడివారు దుర్గంధం భరించలేకపోతున్నారు. సైడు కాల్వలు బాగుచేయాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించలేదని విమర్శిస్తున్నారు.



ఆహార సలహా సంఘ సమావేశాలు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అమరావతి

ఆహార సలహా సంఘాలు సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఎం కార్యదర్శి బి సూరి బాబు తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డుదారులకి డీలర్ ద్వారా నిత్యావసర వస్తువులు సక్రమంగా అందుతున్నాయా లేదా తెలుసు కునేందుకు అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, డీలర్లు, అధికారులతో గతంలో ఆహార సలహా సంఘ సమావేశాలు ఏర్పాటు చేసే వారిని ఆయన గుర్తు చేశారు. సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం వల్లరేషన్ ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు వస్తున్నాయా, లేదా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు వీలులేదన్నారు. గతంలో మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించేవారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11నెలలు అవుతున్నా ఆహారసలహా సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. సూరి బాబు తహశీల్దారుని కోరగా వారు సమావేశం ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. సిపిఎం రూరల్ కార్యదర్శి ఎస్డి మోహుదిన్వలిలో వెంకటేశ్వరరావు సిఐటియు నాయకులు ఎస్కే రఫీ లక్ష్మిశెట్టి ఏడుకొండలు, రాజకుమార్ కే.పాములు ఎస్కే నాగుల మేర పౌలు పాల్గొన్నారు.

అధ్యాపకుడు నిత్య విద్యార్థే

ప్రజాశక్తి - పెదకాకాని

అధ్యాపకుడు ఎప్పుడు నిత్య విద్యార్థిగా ఉండాలని మారుతున్న సాంకేతికతను అంది పుచ్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్య బోధనలు చేయాలని సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మారావు అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నో లాజికల్ యూనివర్సిటీ సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మెకానికల్ అధ్యాపకులకు కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ప్రోగ్రామింగ్‌పై ప్రొఫెషనల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి. పద్మారావు, డాక్టర్ ఎమ్.ఏ.వి రామకష్ణ ప్రారంభించారు. పద్మారావు మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగట్టు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత అధ్యపకులపై ఉందన్నారు. వివిఐటియూ సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, సాంకేతిక విద్యాశాఖ ఒ.ఎస్ సుబ్బారెడ్డి,

పొలాల్లోకి నీరు చేరుతోందని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - పత్తిపాడు

ప్రయివేట్ వెంచర్ వేయడం వలన వర్షపు నీరు పొలాల్లో చేరడంతో ముంపునకు గురై నష్టపోతున్నామని రైతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. వారి మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలోని తూర్పు పాలెం గ్రామం వెళ్ళే సమీపంలో మా పూర్వీకుల నుండి మాకు వ్యవసాయ భూములున్నాయన్నారు. అప్పటి నుంచి వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ఇప్పుడు రియల్ టార్‌ఎస్‌ఎస్ డెవలప్ మెంట్ పేరుతో వెంచర్ వేశారు. వర్షపు నీరు పోయే కాల్వలో చిన్న చిన్న తూములు వేయడం వల్ల రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరి పొలాలు ముంపునకు గుర య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా లేదనీ, పొలంలో ఇప్పటికే పత్తి విత్తనాలు నాటి నష్టపోయామని తెలిపారు. రానున్న రోజుల్లో పంటలు ముంపుకి గురి కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు పిజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

జాతీయస్థాయిలో బెంగళూరులో ఆగస్టు 4, 5 తేదీలలో నిర్వహించే స్విమ్మింగ్ పోటీలకు వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి చదివే ఎస్.కె నజ్రీన్, ఎస్.కె నస్రిన్ ఎంపికైనట్లు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అమ్యూచర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 19, 20 తేదీలలో విశాఖపట్నంలో ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగిన సబ్ జూనియర్ కేటగిరీలో జరిగిన 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో మొదటి స్థానం, 00 మీటర్ల బట్టర్ ఫ్లేలో మొదటి స్థానం, 100 మీటర్ల బట్టర్‌ఫ్లేలో రెండవ స్థానం, 200 మీటర్ల ఇండిడ్యూల్ మెడిలో మూడవ స్థానం ఎస్.కె నజ్రిన్ విజయం సాధించగా, ఎస్కే నస్రిన్ 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో మొదటిస్థానం సాధించిందని అన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన బాలికలను పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కాకుమానుజోజప్ప, పాఠశాల వ్యాయామ శిక్షకులు ఎం. రవికుమార్, నూతక్కి రవి, పాఠశాల ఉపాధ్యాయులు చావా శ్రీనివాస రావు, విజయ కుమారి, ఎస్ఎంసి ఎస్.కె. బషీరున్నీసా, గ్రామపెద్దలు అభినందించారు.

మానవ అక్రమ రవాణ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రైల్వే స్టేషన్‌లో మానవ అక్రమ రవాణాపై సోమవారం రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, క్రాఫ్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈనెల 30న మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 నుంచి 30 వరకు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్పిఎఫ్ ఎస్ఐ వీరా సింగ్, ఏఎస్ఐ ఆర్వి శివారెడ్డి, హెల్త్ ఇన్స్పెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అక్రమ నేరమనీ, ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అక్రమ రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 1800, 1027 222కు సమాచారం ఇవ్వాలని కోరారు. క్రాఫ్ట్ తెనాలి కమ్యూనిటీ సోషల్‌వర్కర్ పర్వీన్ సుల్తానా రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, క్రాఫ్ట్ సంస్థ బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - తాడికొండ

ఆర్టీసీ బస్సుకి తృటిలో పెను ప్రమాదం తప్పింది. గుంటూరు నుంచి తుళ్లూరు వెళ్తున్న బస్సు తాడికొండ పెద్దపరిమి గ్రామాల మధ్యలో వెళుతుండగా ఆకస్మాత్తుగా స్టీరింగ్ ఊడిపోవడంతో బస్సు పంట కాలువలోకి దూసుకు వెళ్లింది. ఈ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. కండక్టరుకు, మరో మహిళకు స్వల్ప గాయాల కావడంతో స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఈపూరు



మృతి చెందిన గోపి

ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇనిమెళ్ళ కురువ వద్ద సోమవారం జరిగింది. ఆరేపల్లి గ్రామానికి చెందిన గుడిపాటి గోపి (23) భద్రుపాలెం గ్రామంలోని సోదరి ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అదే సమయంలో భద్రుపాలెం గ్రామానికి చెందిన పుచ్చ బాలయేసు, ఎం.పిచ్చయ్య ఆటోలో చేజర్ల వైపు వెళ్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురు వేగంగా ఢీకొనడంతో గుడిపాటి గోపికు తీవ్ర గాయాలయ్యాయి. బాలయేసు, ఎం పిచ్చయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుడిపాటి గోపి పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తాళాలు పగల కొట్టి ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల పరిధిలోని మైదవోలు గ్రామానికి చెందిన బండారు వరలక్ష్మి ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌కు వెళ్తూ ఇంటికి తాళం వేశారు. 18వ తేదీన, పక్కింటి వారు ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించి వరలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె వెంటనే హైదరాబాద్ నుంచి వచ్చి పరిశీలించగా బీరువా పగల గొట్టి అందులో ఉన్న 4 గ్రాముల బంగారు, 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.30 వేలు దొంగిలించబడి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై శివ రామకృష్ణ ఎడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రాథమిక ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గర్భస్థ శిశు లింగనిర్ధారణ నేరం

ప్రజాశక్తి - తెనాలి

లింగ నిర్ధారణ నేరమని, అందుకు భిన్నంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ హెచ్చరించారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల లోని కార్యాలయంలో సోమవారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్ట సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేటరీల నిర్వాహకులు లింగనిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చినా, లింగ నిర్ధారణ జరిపినట్లు రుజువైనా చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, డాక్టర్ మానస, డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అందుబాటులోకి పురమిత్ర యాప్

ప్రజాశక్తి - తెనాలి

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో రూపుదిద్దుకున్న పురమిత్ర యాప్ అందుబాటులోకి వచ్చిందనీ, ప్రజలు వినియోగించుకోవాలనిమున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు కోరారు. ప్లేస్టోర్లోయాప్‌లో పురపాలక సంఘానికి సంబంధించి150 సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక ఫోటోతో వాయిస్ మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. మూడు నుంచి 30 రోజులలోపు పరిష్క

పేరు మార్పు / సవరణ

నేను **వంకుడవతు లక్ష్మీభాయి,** W/o **వంకడవతు శ్రీనివాస్ నాయక్,** డోర్ నెం.2-917, సుగాలీ కాలనీ, చిలకలూరిపేట మండలం, పల్నాడుజిల్లా, ఆంధ్రప్రదేశ్.

ప్రస్తుత ఆధార్ కార్డులో ఉన్న పేరు **వెంకూడావతు లక్ష్మీ బై** గా ఉన్నది. కానీ నా అసలు పేరు **వంకుడవతు లక్ష్మీ భాయి**, భర్త **వంకడవతు శ్రీనివాస్ నాయక్.** ఈ సవరణ ఆధార్‌కార్డులో మార్పు కొరకు. నా సెల్ నం. 8885141613.

దస్తావేజులు పోయినవి

షేక్ ఖతిబ్ మౌలాలి S/o మహబూబ్ మునగపాడు గ్రామం ఫిరంగిపురం మండలంకు చెందిన Land document No. 813/2000 ఫిరంగిపురం సబ్ రిజిస్టర్ ఆఫీసు వారిచే రిజిస్టర్ కాబడిన ల్యాండ్ పత్రాలు తీసుకొని ది.20.06.2025న నరసరావుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ సెంటర్ నుండి జిరాక్స్ షాపు వద్దకు ఆటోలో వెళుతుండగా పైన తెల్పబడిన నా పత్రాలు మార్గ మధ్యలో జారిపోయినవి . కావున మీకు ఏవరికైనా సదరు Document No. 813/2000 పత్రాలు దొరికిన ఈ క్రింది PH. No. 9490913668 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S. No. 79/2023

బిట్వీన్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
చీఫ్ మేనేజర్, వినుకొండ బ్రాంచి, వినుకొండ టౌన్,
పల్నాడు జిల్లా, వినుకొండ జె.సి.జె.సి .... వాది
ఎదిరి
వినుకొండ వేంకటేశ్వర్లు .....ప్రతివాది
వినుకొండ వెంకటేశ్వర్లు, తండ్రి బ్రహ్మం
నివాసము:- డోర్ నెం. 1/278, దొండపాడు గ్రామం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా.
వినుకొండ జె.సి.జె.సి

పై నెంబరు దావాలోని ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిస్ట్రారు పోస్ట్ ద్వారా ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసిననూ, మీరు తీసుకొనని కారణముచే శ్రీకోర్టువారు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మీరు ది.23-07-2025న ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా గాని మీ తరపు న్యాయవాది ద్వారా గాని పై తెల్పిన కోర్టునకు హాజరు కావలెనని, మీరు రాని యెడల శ్రీ కోర్టువారు పై నంబరు దావాను మీ పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేయుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా:- 23-07-2025

యలవర్తి శ్రీనివాసరావు
న్యాయవాది,
వినుకొండ, పల్నాడు జిల్లా
సెల్.నెం.9440835056

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
IA :384/2023 in OS: 9/2023

పోట్రు వెంకట రత్నం వగైరాలు ...పిటిషనర్లు
V/s
నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు వగైరాలు ...రెస్పాండెంట్లు

To:
(R2) నిమ్మగడ్డ రమణ రవిచంద్ర
S/o. వెంకట సుబ్బారావు
R/o. పెదనందిపాడు (V)&(m), గుంటూరు (Dt)

నోటీసు

పై నెంబరు పిటిషన్ లో మీ హాజరు నిమిత్తం ది: 29/07/2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 29/07/2025న ఉదయం గం 10.30 ని॥లకు పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో స్వయంగా కాని, న్యాయవాది ద్వారకాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవచ్చును. లేని ఎడలు మీ పరోక్ష మందు విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది .

"శ్రీకోర్డు వారి ఉత్తర్వుల మేరకు"
వాయిదా తేది: 29/07/2015
స్థలం. పర్చూరు
తేదీ: 20/07/2025

ఇట్లు
మండవ వీరాజనేయులు
వాది తరుపు అడ్వకేట్

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
IA :385/2023 in OS: 9/2023

పోట్రు వెంకట రత్నం వగైరాలు ...పిటిషనర్లు
V/s
నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు వగైరాలు ...రెస్పాండెంట్లు

To:
(R2) నిమ్మగడ్డ రమణ రవిచంద్ర
S/o. వెంకట సుబ్బారావు
R/o. పెదనందిపాడు (V)&(m), గుంటూరు (Dt)

నోటీసు

పై నెంబరు పిటిషన్ లో మీ హాజరు నిమిత్తం ది: 29/07/2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 29/07/2025న ఉదయం గం 10.30 ని॥లకు పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో స్వయంగా కాని, న్యాయవాది ద్వారకాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవచ్చును. లేని ఎడలు మీ పరోక్ష మందు విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది .

"శ్రీకోర్డు వారి ఉత్తర్వుల మేరకు"
వాయిదా తేది: 29/07/2015
స్థలం. పర్చూరు
తేదీ: 20/07/2025

ఇట్లు
మండవ వీరాజనేయులు
వాది తరుపు అడ్వకేట్

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
OS: 9/2023

పోట్రు వెంకట రత్నం వగైరాలు ...వాదులు
V/s
నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు వగైరాలు ...ప్రతివాదులు

To:
(D2) నిమ్మగడ్డ రమణ రవిచంద్ర
S/o. వెంకట సుబ్బారావు,
R/o. పెదనందిపాడు (V)&(m), గుంటూరు (Dt)

దావా సమను

పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం ది: 29/07/2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 29/07/2025న ఉదయం గం 10.30 ని॥లకు పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో స్వయంగా కాని, న్యాయవాది ద్వారకాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవచ్చును. లేని ఎడలు మీ పరోక్ష మందు దావాను విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది .

"శ్రీకోర్డు వారి ఉత్తర్వుల మేరకు"
వాయిదా తేది: 29/07/2015
స్థలం. పర్చూరు
తేదీ: 20/07/2025

ఇట్లు
మండవ వీరాజనేయులు
వాది తరుపు అడ్వకేట్

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
IA : 383/2023 in OS: 9/2023

పోట్రు వెంకట రత్నం వగైరాలు ...పిటీషనర్లు
V/s
నిమ్మగడ్డ వెంకట సుబ్బారావు వగైరాలు ...రెస్పాండెంట్లు

To
(R2) నిమ్మగడ్డ రమణ రవిచంద్ర,
S/o. వెంకట సుబ్బారావు
R/o. పెదనందిపాడు (V)&(m), గుంటూరు (Dt)

నోటీసు

పై నెంబరు పిటిషన్ లో మీ హాజరు నిమిత్తం ది: 29/07/2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 29/07/2025 న ఉదయం గం 10.30 ని॥లకు పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో స్వయంగా కాని, న్యాయవాది ద్వారకాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొన వచ్చును. లేని ఎడలు మీ పరోక్ష మందు విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది .

"శ్రీకోర్డు వారి ఉత్తర్వుల మేరకు"
వాయిదా తేది: 29/07/2015
స్థలం. పర్చూరు
తేదీ: 20/07/2025

ఇట్లు
మండవ వీరాజనేయులు
పిటీషనర్ల తరుపు న్యాయవాది

అచ్యుతానందన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - యడ్లపాడు

సిపిఎం అగ్రనాయకులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం యడ్లపాడు మండల కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఆయన చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించింది. నివాళులర్పించిన వారిలో జె.శంకరరావు, యడ్లపాడు బి.పీటర్, ఎ.సుబ్బారావు, ఎన్.కాళిదాసు తదితరులున్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు 25న కౌన్సెలింగ్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఐటిఐలో 2024-25 సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు ఈనెల 25వ తేదీ (శుక్రవారం)న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రభుత్వ ఆర్ఐటిఐ జిల్లా కన్వీనర్ పి.పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మాచర్ల ప్రభుత్వ ఐటిఐలో కౌన్సెలింగ్ జరుగుతుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో, పదవ తరగతి మార్క్స్ మెమో, టి.సి, స్టడీ సర్టిఫికేట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్, ఈ -మెయిల్ ఐడితో పాటు దరఖాస్తు, వెరిఫికేషన్ చేసుకున్న డాక్యూమెంట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతులు పక్షాన ప్రభుత్వమే బీమా సొమ్మును చెల్లించాలని పెదకూరపాడు అభివద్ధి (పిడిఎఫ్) కన్వీనర్ డి.శేషారావు, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.మస్తాన్‌రావు, అలీ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ధనలక్ష్మికి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. మిర్చి, పత్తి, కంది, శనగ, మొక్కజొన్న, పసుపు ఇతర పంటలకు కూడా బీమాను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. నష్టపరిహారం లెక్కించేటప్పుడు గ్రామం యూనిట్‌గా తీసుకోవాలని కోరారు. పెదకూరపాడులో గతేడాది వరకు రెండు వ్యవసాయ సహాయక పోస్టులు, ఉద్యాన శాఖ సహాయకులు పోస్టు ఉండేవని, ప్రస్తుతం మూడు పోస్టులను వ్యవసాయ సహాయకులుగా మార్చడం వల్ల మిర్చి, పసుపు ఇతర కూరగాయపంటల రైతులకు నష్టమని చెప్పారు. వినతిపత్రం ఇచ్చినవారిలో పి.శ్రీనివాసరావు, జి.శ్రీను, హరిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

వసతుల్లేక దుర్భర స్థితిలో 300 కుటుంబాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పిడుగురాళ్ల మండలం వేమగిరి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 300 కుటుంబాలు మౌలిక సదుపాయాలు లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఎఐకెఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాష అన్నారు. ఈ మేరకు సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రెడ్ బాష మాట్లాడుతూ వేమగిరి గ్రామం స్వాతంత్ర్యం రాకముందే రాజులు, జమీందారుల పాలనలో ఏర్పడిందన్నారు. తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని, నివాసితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్ళు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయా కుటుంబాలు సమీపంలో ఉన్న 4 వేల ఎకరాలకు అటవీ హక్కుల చట్టంలో 2006 చట్టం ప్రకారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, నాగేశ్వరరావు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై అర్ధనగ్నంగా నిరసన

- 9వ రోజుకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె
- జోరువానలోనూ కొనసాగిన ఆందోళనలు - మాచర్లలో ధర్నా



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారమూ జోరువానలోనూ కొనసాగింది. నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజు, పారిశుధ్య కార్మికుల సమ్మె 6వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించాలన్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి 7 లక్షలకు పెంచాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు, కార్మికులు షేక్ చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీసింగ్, బి.శ్రీను, కిరణ్కుమార్, మురళి, సామ్రాజ్యం, వెంకట్, వాసు, ఖాదర్, గౌస్, మాలిక్, సురేష్, రంగనాయకులు, కోటేశ్వరావు, షేక్ ఖాన్, సాల్మన్, వీరకుమార్, మల్లయ్య, యోహాన్, ఏసు, జీవరత్నం, విజయలక్ష్మి, ప్రసాద్, నరసింహారావు, జాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక సమ్మె శిబిరం నుండి బ్యాంక్ సెంటర్, సినిమాలు సెంటర్, గంగమ్మ గుడి, హైలాండ్ సెంటర్, జానపాడు రోడ్డులో అర్ధనగ్నంగా భారీ ర్యాలీ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను రోడ్డు మీదకు నెట్టిందని, వారి సమస్యలు పరిష్కరించడానికి ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలనువిస్మరించిందని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న చెప్పులు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కోరారు. కార్యక్రమంలో కార్మికులు మధుబాబు, రత్నకుమార్, నాగుర్, మొగిలి నాగేశ్వరరావు, తిరుపతిరావు, రమేష్, విజయ్ కుమార్, కుంభ కొండలు, అంగిడి రామారావు, మొగిలి నాగేశ్వరరావు, కొమర గురవయ్య, కంప సాగర్‌బాబు, కంపా వీరమ్మ, కృష్ణవేణి, మార్తమ్మ, అనంతలక్ష్మి, శౌరమ్మ, మేరమ్మ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - మాచర్ల

అప్కాస్ కింద పని చేసే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సిఐటియు నాయుకులు వై.సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై మాచర్ల మున్సిపాలిటి పరిధిలో అప్కాస్ కింద పనిచేసే కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. శిబిరాన్ని ప్రారంభించిన సురేష్ మాట్లాడుతూ జిఒ 36 ప్రకారం ఇంజనీరింగ్ విభాగ కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలన్నారు.గత సమ్మెలో చేసిన ఒప్పందాలు నేటికి అమలుకాకపోవడం బాధాకరమన్నారు. తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను అప్కాస్ క్రింద పని చేసే కార్మికులందరికి పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అప్కాస్ పరిధిలోని కార్మికుల శ్రేయస్సు కోసం జరుగుతున్న పోరాటానికి అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలన్నారు. సమ్మెలో మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు వేముల వెంకటరావు, కొమెర రమణ, కుమారి, అనసూర్య, సాగర్‌బాబు, దేవళ్ళ రమణ, బండారు రమణ, తిరుపతమ్మ, దుర్గయ్య, యర్రసాని గురవయ్య, యాకోబు పాల్గొన్నారు.





ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు వంటికాలిపై నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాట్లాడారు. సిహెచ్ వెంకయ్య, చంద్రకళ, జల్ది రమేష్, సిహెచ్ సునీత, దుర్గ, కుమార స్వామి, జానీ, థామస్ పాల్గొన్నారు.

యాప్‌లతో అవస్థలపై అంగన్వాడీల ధర్నా



ప్రజాశక్తి - పిడుగురాళ్ల : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం ధర్నా చేసి సూపర్‌వైజర్లు నాగమణి, వెంకటలక్ష్మికి వినతిపత్రాలిచ్చారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి డి.శాంతమణి మాట్లాడుతూ అంగన్వాడీలకు పనిచేయని ఫోన్లు ఇవ్వడం వల్ల సిగ్నల్ అందక ఇబ్బందులు పడుతున్నామని, రకరకాల యాప్‌లతో అవస్థ పడుతున్నామని చెప్పారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా చేయాలని, పాతఫోన్ల స్థానంలో 5జి ట్యాబులు ఇవ్వాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లల్ని అంగన్వాడి సెంటర్లో చేర్పించే విధంగా ప్రభుత్వ జీవో ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న కాన్వెంట్ బిల్లు ఇవ్వాలని, అంగన్వాడీలకు సైతం తల్లికివందనం పథకాన్ని వర్తింపజేయాలని, ఉచిత గ్యాస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, అంగన్వాడీలు రాధిక, పద్మ, సువర్ణరాణి, జయకుమారి, విజయరాణి, నాగమణి, వరలక్ష్మి, శాంతకుమారి, జయశ్రీ పాల్గొన్నారు.

నాణ్యత లేని సరుకుల సరఫరాపై చర్యలు తీసుకోవాలి

గ్రీవెన్స్‌లో పల్నాడు కలెక్టర్‌కు ఫిర్యాదు - జిపిఆర్ఎస్‌కు 249 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వరమే పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి కలెక్టర్‌తోపాటు జెసి సూరజ్ ధనుంజయ్, డిఆర్ఒ మురళి 249 అర్జీలు స్వీకరించారు.

అంగన్వాడీ సెంటర్లకు పోషకాహారం కింద అందజేస్తున్న గుడ్లు, పాలు, ఇతర సరుకులు నాణ్యమైనవి ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు, హాస్టల్ విద్యార్థులకు అందించే కోడిగుడ్లు, పాలు ఇతర పోషకాహారాలు నాణ్యత ఉండడం లేదన్నారు. కాంట్రాక్టర్ల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో జిల్లాలో ఫుడ్ కమిషన్‌కు సంబంధించిన అధికారులు కూడా తనిఖీలు చేసి పరిమాణం తగ్గిన కోడిగుడ్లు, ముద్ర లేనివి సెంటర్లుకు వెళుతున్నాయని గుర్తించినట్లు చెప్పారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నెల రోజులు పైబడి క్లాసులు జరుగుతున్నా సీట్లు భర్తీ చేయడంలో పాఠశాలలు, కళాశాలల అధ్యాపకులు నిర్లక్ష్యం విడనాడాలన్నారు.

అక్రమ మైనింగ్‌పై జిల్లా, మండల స్థాయిల్లో టాస్క్ ఫోర్స్

అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, సీటీఓ, మైన్స్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన కమిటీ జిల్లా స్థాయిలో మైనింగ్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుందన్నారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్స్‌లో తహశీల్దార్, ఎస్సై, రవాణా శాఖ, వాణిజ్య పన్నులు/జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. ఖరీఫ్‌లో పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు డీలర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పి4 గ్రామ సభలలో నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా పాల్గొని బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల వివరాలను ధ్రువీకరించాలని ఆదేశించారు. దీపం పథకం నగదు బ్యాంకు ఖాతాల్లో జమకాని వారి సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, రేషన్ షాపుల పనితీరును మెరుగుపరచాలని చెప్పారు.





మంగళగిరి సమ్మె శిబిరంలో పాల్గొన్న సిఐటియు నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, తాడేపల్లిలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు, తెనాలిలో సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె సోమవారం నాటికి ఎనిమిదో రోజు చేరింది. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, రాజధాని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ న్యాయమైన కోరికల కోసం చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఎనిమిది రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. వెంటనే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కలుగజేసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని అన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.గోపి, కేదార్నాథ్, ప్రకాష్, సాంబశివరావు, రమణయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో మానవహారం

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లిలో ఇంజనీరింగ్ కార్మికులు, పరిశుద్ధ కార్మికులు సోమవారం కూడా సమ్మెను కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం గేటు సెంటర్లో మున్సిపల్ కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని మానవహారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పట్ల ఇంత నిర్లక్ష్యం వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఇంజనీరింగ్ కార్మికులు జీతాలు పెంచి పారిశుద్ధ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు డి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఇంజనీరింగ్ కార్మికులు పారిశుద్ధ్య కార్మికులు ఐక్యంగా పోరాటం ద్వారానే మన సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, శ్రీనివాసరావు, డేవిడ్, కామాక్షి, యంగమ్మ, సంతోషం, సతీష్, మేరీ,రాంబాబు, శశికళ, సువార్త, కంచర్ల అనూష, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరింది. పురపాలక సంఘ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని దాల్ మిల్లు ముఠా కార్మిక సంఘం నాయకులు జి.వెంకటసుబ్బయ్య, సిహెచ్. శేషగిరిరావు సందర్శించి మద్దతు తెలిపారు. అలాగే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం ప్రధానకార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎవిఎన్ కుమారి, పి. విజయలక్ష్మి ఎన్. పావని, షేక్ హసీనా బేగం, జి.లావణ్య సుజాత, కనక దుర్గ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం చేయాలని సూచించారు. తమ మద్దతు అన్ని విధాలా వుంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్, డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 23, 24, 25 తేదీలలో గుంటూరులో జరిగే భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మంగళగిరి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, షేక్ జానీ భాష తెలిపారు. ఈ మేరకు సోమవారం మంగళగిరి న్యూ ఇండియా హోటల్ సెంటర్లో మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కొరకు సంఘం అనేక ఉద్యమాలు చేసి సమస్యలను పరిష్కరించుకున్నామన్నారు. మూడు రోజులు పాటు జరిగే మహాసభల్లో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.మాబుఖాన్, ఎస్.కె.రెహమాన్, నంద్రు శివ, ఎం.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్ అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం చేపడతామని లబ్ధిదారులను మోసంచేసిన గుత్తేదారు ఎం పున్నారావును అరెస్ట్ చేసినట్లు తెనాలి రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా మండలంలోని పెదరావూరు లేఅవుట్‌లో లబ్ధిదారులు ఒక్కొక్కరికి 48 గజాల స్థలం కేటాయించిన విషయం తెల్సిందే. ఇంటి నిర్మాణాలకు ఒప్పందం కుదుర్చుకున్న పట్టణానికి చెందిన ఎస్‌జి బిల్డింగ్‌వర్క్ పున్నారావు కాలపరిమితి ముగిసినా నిర్మాణాలను చేపట్టలేదు. ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను విడతలవారిగా గుత్తేదారులు వసూలు చేసినట్లు లబ్ధిదారులు ఆరోపించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో బుర్రిపాలెం, నేలపాడు గ్రామాలకు సంబందించిన లే ఔట్ల కేసులో పున్నారావుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరించినట్లు తెలిపారు. పెదరావురు లే ఔట్లకు సంబంధించి పిటి వారెంట్ పై నరసరావుపేట సబ్ జైల్ నుంచి తెనాలి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచామని, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించి నరసరావుపేట సబ్ జైల్ కు తిరిగి తరలిచినట్లు పేర్కొన్నారు. ఇదేవిధమైన ఆరోపణలు ఎదుర్కుంటున్న కోటేశ్వరరావు, నరేష్, బాలరాజు, ఆలీ, మోషే, కొండ మరికొందరిపై దర్యాప్తు జరుగుతుందని, వారిని త్వరలో అరెస్టు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సొసైటీ చైర్మన్ మేకల మోహనరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను చైర్మన్ మేకల కట్ చేశారు. అనంతరం పలువురు మోహనరావును శాలువాతో సత్కరించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ సింహాద్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా మోహనరావు పేద విద్యార్థు టలకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలలో శిక్షణ ఇవ్వడం అభినంద నీయమన్నారు. మేకల భవిష్యత్తులో సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ, మంచి కీర్తి ప్రతిష్టలు పొంది, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాధాకృష్ణా యోగ సేవ కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ, యోగి గురూజీ, తాడేపల్లి జనసైతన్య వేదిక అధ్యక్షులు మాచర్ల యేసోబు, ఆర్యవైశ్య ప్రముఖులు మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి అచ్యుతానందన్

ప్రజాశక్తి - మంగళగిరి

కేరళ మాజీ సీఎం, సిపిఎం అగ్రనేత వి.ఎస్.అచ్యుతానందన్ నిరంతరం ప్రజల కోసం పాటుపడిన మహనీయుడు అని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. సోమవారం రాత్రి సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతనందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ చిన్నతనం నుండి కమ్యూనిస్టు భావజాలాన్ని పునికి పుచ్చుకొని దేశంలోనే కమ్యూనిస్టు పార్టీ నేతగా ఎదిగారని అన్నారు. కేరళలో జరిగిన అనేక పోరాటాలు ప్రజల కోసం చేశారని అన్నారు. అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరంలోటని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్లాల్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద పరిపాలనలో దేశవ్యాప్తంగా పేద ప్రజలు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, పట్టణ నాయకులు ఎస్.గణేష్, ఎం.నాగేశ్వరావు, టి.శ్రీరాములు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షులుగా కాటూరి వెంకటేశ్వరావు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



కాటూరి వెంకటేశ్వరరావు

విశాఖపట్నంలోని బి.వి.కె కళాశాల ఆవరణలో జులై 20న జరిగిన సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు కాటూరి శిల్పశాల నిర్వాహకులు కాటూరి రవి చంద్ర తెలిపారు. సంస్థ అధ్యక్షుడిగా పివిఎన్ కృష్ణ ఉపాధ్యక్షులుగా కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి గా గుంటల రామ్ కుమార్, కార్యదర్శిగా పి.రంగా మన్నార్, దృశ్యక ళల సమయోజకులుగా అల్లు రాంబాబు నియమితులైనట్లు సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సం స్కార భారతి అఖిల భారత కార్యదర్శి సంతోష్ ఆదోని హాజరైనట్లు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్, డీఎస్ఎంఎం నాయకులు

కెవిపిఎస్, డీఎస్ఎంఎం జిల్లా ఆరవ మహాసభలు సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.. సామాజిక న్యాయం అంశంపై స్థానిక టిప్పర్ల బజార్లోని ముజఫర్ అహమద్ భవనంలో ఆగస్టు మూడో తేదీన జరిగే సదస్సు కరపత్రాన్ని సోమవారం మంగళగిరి కేవీపీఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవిపిఎస్ మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్ మాట్లాడుతూ కెవిపిఎస్ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన పోరాట లక్ష్యాలతో 1998లో ఏర్పడిందని అన్నారు. అప్పటినుండి దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుంది అని అన్నారు. ఇటీవల రాష్ట్రంలో పలు దళిత వ్యతిరేక ఘటనలు బయటపడ్డాయని అన్నారు. ఇవన్నీ సమాజంలో ఇంకా కుల వివక్ష ఉన్నదని, దాని రూపాలు మారుతూ ఉన్నాయన్నడానికి నిదర్శనమని అన్నారు. కాగా సదస్సులో డి.ఎస్.ఎం.ఎం. జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రిటైర్డ్ ఐఏఎస్ శ్యామల ఆనందకుమార్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సందర్భంగా జరిగే సదస్సులో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జె.నవీన్ ప్రకాష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు వి.వి.జవహర్‌లాల్, జె.వి.రాఘవులు, బి.ఆదియ్య, కాటమరాజు, ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణ పనులను వారంలో రెండు సార్లు పరిశీలిస్తా

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు

'ఇకనుంచి రాజధాని నిర్మాణ పనులను వారంలో రెండు సార్లు పరిశీలిస్తా.. వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో చెప్పండి.. మూడేళ్ళలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులను మరింత వేగవంతం చేయండని..' మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నిర్మాణ సంస్థల ప్రతినిధులనుద్దేశించి అన్నారు. రాజధాని అమరావతిలో మంత్రి సోమవారం పర్యటించారు. సిఆర్‌డిఎ ఇంజనీర్లతో కలిసి నిర్మాణంలో ఉన్న భవనాల పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. అఖిల భారత సర్వీస్ (ఎఐఎస్) అధికారులు, మంత్రులు, జడ్జీలు, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన నిర్మాణాలను, శాశ్వత సచివాలయం నిర్మాణ ప్రదేశాన్ని మంత్రి పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. రాజధాని నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లు దక్కించుకున్న నిర్మాణ సంస్థలు పనుల పూర్తికి కృషి చేస్తున్నాయని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎఐఎస్ అధికారులు, సెక్రటరీలు, మంత్రులు, జడ్జిల



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

బంగ్లాల పనులు వేగంగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎఐఎస్ అధికారుల క్వార్టర్లు డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామని చెప్పారు. మిగిలిన భవనాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా ఇంటర్నల్ పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం రైతులను, కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టిందని అన్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌పై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు సమావేశం అవుతున్నారని మంత్రి వెల్లడించారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సొసైటీ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సొసైటీ అభివృద్ధికి పాలక వర్గ సభ్యులు కృషి చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో పాకాలపాడు పిఎసిఎస్ ఛైర్మన్‌గా కొణికినేని సత్యనారాయణ సభ్యులుగా పేరం హరిబాబు, అన్నదాసు వెంకట్రామయ్య ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోపరేటివ్ సొసైటీల పాత్ర కీలకమనీ, కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో సొసైటీలో జరిగిన అవకతవకల గురించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు టిడిపి నాయకులు యర్రా వెంకటేశ్వరరావు కె. శ్రీనివాసరావు వై.రామస్వామి జనసేన నాయకులు టి, భవనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

నిధుల విడుదలకు చొరవ చూపండి

ప్రజాశక్తి - మాచర్ల

వరికపూడిశెల ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విడుదలకు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎంపి లావు శ్రీ క్రిష్ణ దేవరాయులు, ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మ నందరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్‌లోనే ఎంపి, ఎంఎల్ఎలు వరిక పూడి శెలకు నిధులు విడుదల చేయించి వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మాచర్ల నియోజకవర్గంలో పర్యాటక ప్రాజెక్టు, భారీ ప్రాజక్టు మంజూరు చేయించాలన్నారు. దీని వలన మాచర్ల ప్రాంతంలోని వేలమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అందుతాయన్నారు. సమావేశంలో దుర్గి, మాచర్ల, రెంటచింతల అధ్యక్షులు చెమట వెంకటేశ్వర్లు, గాదె పుల్లారెడ్డి, దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్‌నాయకులు షేక్‌బాబు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



బాధితుల నుంచి సమస్యలు వింటున్న తహశీల్దార్

ప్రజావేదికకు మూడు ఫిర్యాదులు

తహశీల్దార్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 3 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భూమి సమస్యలపై 2, విద్యుత్ శాఖకు చెందిన మరో ఫిర్యాదు అందినట్లు తహశీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్మార్ట్ మీటర్లను బిగించడానికి ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరుతూ ప్రజా వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదాని కంపెనీలకు దోచిపెట్టడానికి స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం తీసుకుందని తెలిపారు. దీనివలన ప్రజలకు ఇప్పుడున్న దానికంటే ఎక్కువగా విద్యుత్ భారం పడుతుందనీ, దీన్ని వ్యతిరేకిస్తూ స్మార్ట్ మీటర్లు బిగించడానికి అడ్డుకోవాలని ఆయన ప్రజలను కోరారు. నరేంద్రమోడీ విధానాల్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని ప్రజలకు పిలుపు ఇచ్చిన మంత్రి లోకేష్ ఈరోజు ఇళ్లకు మీటర్లు బిగించడాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. దీన్ని అడ్డుకోవడం కోసం కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్తు సబ్‌స్టేషన్, సచివాలయల వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు, కూలిసంఘం నాయకులు నీలాద్రి రాంబాబు, సిపిఐ పల్నాడు ఏరియా కార్యదర్శి యం.రమణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు సంద్రపాటి నాగేశ్వరరావు, ఏఐటియుసి నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ట్కతు సంఘం నాయకులు దీకొండ వెంకటేశ్వర్లు, బిక్షాలు, కొండూరు విజయ సారధి, నాగేశ్వరరావు ,సాగర్ బాబు శ్రీను, కరిముల్లా, ఇతర సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు కూటమి నేతలు అండగా ఉండాలి : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలో పేదలు, అవసరంలో ఉన్నవారికి కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు అండగా నిలవాలని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పేదలకు ఇళ్ల స్థలాలు, నూతన పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు, వికలాంగులకు సదరం సర్టిఫికేట్లు పంపిణీలో అర్హులైన అవసరంలో ఉన్నవారికి సహాయంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ఛైర్మన్, పర్సన్ల ప్రమాణస్వీకార కార్యక్రమంలో జీవీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా బచ్చు అంజిరెడ్డి, సభ్యులుగా గంగినేని బ్రహ్మయ్య, మందా ఏసు ప్రమాణస్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. నూతన కమిటీ సభ్యులు రానున్న రోజుల్లో ఎరువుల



నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జీవీ

కొరతను సమర్థంగా ఎదుర్కోవాలి. ఏడాదిలో 9.34లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా 9 లక్షలమందికి ఉద్యో గాలు రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయుకులు, అధికారులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండ్లకుంటలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పర్యటన

మోడల్ స్కూల్ వసతులపై ఆరా



పాఠశాల వసతులపై అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం, కండ్లకుంట గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. అక్కడున్న మౌళిక వసతులు, విద్యాబోధనలకు సంబంధించిన అంశాలను స్కూల్ వైస్ ప్రిన్సిపల్ పాండు రంగారావును అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంగణం, తరగతి గదులను కలయ తిరిగి పరిశీలించారు. తాగునీరు, విద్యుత్‌కు సంబంధించిన ఇబ్బందులపై ఆరా తీశారు. వసతి గృహం ఏర్పాటుకు కావాల్సిన వసతులు, నిధులు గురించి ఏపీ మోడల్ స్కూల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవానంద రెడ్డితో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో నిధులు కేటాయించి, వసతి గృహానికి తాగునీరు, విద్యుత్, ప్రహరిగోడ, సోలార్ ఫెన్సింగ్ నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు.

ఐదేళ్లుగా విద్యార్థుల అవస్థలు..!

మండలంలో మోడల్ స్కూలుకు వసతిగృహం ఏర్పాటు చేయకపోవడంతో గుండ్లపాడు, గొట్టిపాళ్ల, కేపీగూడెం, గంగలకుంట, మండాది గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ వసతి కల్పిస్తే విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలో వసతి గృహం ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి విన్నవించగా సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో సంప్రదించి సాధ్యమైన త్వరగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట జూలకంటి అక్కిరెడ్డి ఉన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. సుబ్బారెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహ కారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే వాతావరణ ప్రతికూల మార్పులతో పంటనష్టం నుంచి కలిగే ఆర్థిక ఇబ్బందుల నుండి రైతులను ఆదుకునేందుకు "పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం" ఖరీఫ్ -2025 నుండి అమలు చేస్తుందని చెప్పారు. సత్తెనపల్లి మండలంలో ప్రత్తి పంటను సాగు చేసే రైతులు ప్రత్తి పంటకు బీమా కొరకు ఎకరాకు ప్రీమియం రూ.1900లు చెల్లించి మీ పత్తి పంటకు జులై 31వతేదీ లోపు బీమా చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వాతావరణ ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగితే బీమా మొత్తం రూ.38వేలు పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీసేవా సెంటర్, రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేసుకోవాలని సూచించారు.



ఆసుపత్రిలో సౌకర్యాలపై అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సోమవారం పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతుల గురించి తెలుసుకుని తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట పరస తాళ్లూరు సొసైటీ ఛైర్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, ఎస్సీ నాయకులు జంగాల వరప్రసాద్ పాల్గొన్నారు.

అమరావతిలో పలు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - అమరావతి

పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నాయకత్వంలో అమరావతి మండలంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అమరావతి ఎంపీపీ మేకల హను మంత రావు అన్నారు సోమవారం అమరావతి మండలం, దిడుగు గ్రామం, ఎస్సీ కాలనీలో ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న సిసి డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో శానిటేషన్ కార్యక్రమాలు చేప ట్టాలని సూచించారు.అమరావతి ఎండిఓ టీ.పార్వతి, అమరావతి మండల టిడిపి అధ్యక్షులు మంచినేని రాజా, బొబ్బాల నరేష్, బిజెపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ సవరణ బిల్లును రద్దు చేయండి

ప్రజాశక్తి - మాచర్ల

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో పాస్ చేయించిన పెన్షన్ ధ్రువీకరణ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ బిల్లు భారతదేశంలో సర్వీస్ పెన్షనర్ల ప్రయోజనాలని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఇక ముందు పెన్షన్ ఫిక్సేషన్ లాంటి ప్రయోజనాలు కోల్పోతారని తెలియజేశారు. ఇప్పటికే రావలసిన 12వ పిఆర్‌సి ఆలస్యం అయిందన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇంచార్జ్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలిబ్, సహాయకార్యదర్శి గౌస్ మొహిద్దీన్, సుబ్బారావు, రామారావు, నారాయణ, మాబు, రాయపరెడ్డి, జగన్నాథచార్యులు, అంజయ్య, నూతన సభ్యులు కిరీటిరెడ్డి, భాస్కరబాబు, నాగార్జునరాజు, కోటయ్య, ఎలిజిబెత్‌రాణి, శివపార్వతి, కోటేశ్వరరావు, యేసుపాదం పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ రవితేజా నాయక్

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - రాజుపాలెం

సోమవారం రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధిలోని 20 మంది క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార నిమిత్తం డాక్టర్ రవితేజా నాయక్ నిక్షయఫుడ్ బాస్కెట్స్ పంపిణీ చేశారు. క్యూబ్ హైవేస్ ఫౌండేషన్ వారి సహకారంతో పోషకాహార కిట్స్ అందచేస్తున్నామని తెలిపారు. డాక్టర్ రవితేజా నాయక్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు మందులు వాడినంతకాలం పోషకాహారం నిమిత్తం ఫుడ్ బాస్కెట్ అందచేస్తారని తెలిపారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా 20మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రోసూర్ టీ.బి యూనిట్ పర్యవేక్షకులు సౌజన్య, ఇబ్రహీం, రాజరమేష్, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఫార్మసిస్ట్ శివ, ఆరోగ్య సిబ్బంది పాల్గున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి- పెదకాకాని

ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ కృష్ణకాంత్‌కు ఆయన ఆర్జీ అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ దశాబ్దాలుగా పెదకాకాని మండల పరిధిలోని సుందరయ్య కాలనీ స్వర్ణ పురి కాలనీ, శ్రీ లక్ష్మీ దుర్గ శివ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హార్స్ ఫర్ కాలనీ ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటు చేసుకొని రెండు కుటుంబాలు రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారని ఏళ్ళ గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్న ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు అందరికీ ఇండ్ల



తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న నన్నపనేని శివాజీ

పట్టాలిస్తామని ఇల్లు లేని వారికి గ్రామాలలో అయితే మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు స్థలం ఇస్తానని వాగ్దానాలు చేసిందని నేడు అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న వాటి గురించి ఆలోచించడం లేదన్నారు. రేషన్ కార్డు జారీ విధానంలో అవకతవకలు ఉండటం వల్ల తల్లికి వందనం లాంటి పథకాలు చాలామందికి అందలేదు అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ కార్డు జారీలో ఉన్న సాంకేతిక లోపాలను తక్షణమే సరి చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి జీవో నెంబర్ 30 ప్రకారం రెగ్యులర్ చేయాలని ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మౌలిక వసతులు కల్పించాలని ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉదఅతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బురద గుంట సాంబయ్య, ఆముదాల నాగేశ్వరరావు, షేక్ జానీ భాష, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజనసింహ

పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తాం

ప్రజాశక్తి - దుగ్గిరాల

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ పసుపు బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తామని సబ్ కలెక్టర్ బి.సంజనసింహ అన్నారు స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో సోమవారం అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీమా కంపెనీ నుండి వచ్చిన ప్రీమియం 20 కోట్ల 54 లక్షలు 294 మంది బాధితుల అకౌంట్లలో జమ చేస్తారని అందులో భాగంగా బాధితుల ఖాతాలు క్రాస్ చెకింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎకౌంట్ నెంబర్లలో తేడాలు ఏమైనా ఉందా ఏముందని పరిశీలిస్తున్నారు. దుగ్గిరాల యార్డులో కొంతమంది ఖాతాలు పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నవారి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐ.సునీత, యార్డు సెక్రటరీ జె.వి.సుబ్బారావు, మార్కెటింగ్ శాఖ ఏడి సత్యనారాయణ చౌదరి, హార్టీకల్చర్ అధికారి శ్రీ నిత్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న ప్రజాసంఘాల నాయకులు మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం వెంటనే క్వింటాలుకు 7000 రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం వివిధ కారణాల చూపించి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించటం లేదని విమర్శించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్, ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, మండల నాయకులు జెట్టి బాలరాజు, బి.అమ్మిరెడ్డి, రైతులు నాదెళ్ల చంద్రశేఖర్, భీమిరెడ్డి శేషురెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మాదకద్రవ్యాల నివారణకు యువత కృషి చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాల నివారణకు యువత కృషి చేయాలని తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు అన్నారు. సోమవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రాతూరులోని టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్కూల్, గుడ్ న్యూస్ స్కూల్ విద్యార్థులతో కలసి గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వీరేంద్రబాబు మాట్లాడారు. టీడీపీ తాడేపల్లి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్, ఎస్ఐలు ప్రతాప్ కుమార్, షేక్ ఖాజావలి, కూటమి నాయకులు పాటిబండ్ల నరసింహారావు,సంకూరి బ్రిడ్జి రాజు, పాటిబండ్ల వంశీ, గురపు రమేష్, పాటిబండ్ల రాము, ఆలపాటి సాంబశివరావు, ప్రాతూరు బాబురావు, ప్రాతూరు విద్య సాగర్, సంకూరి నాని, ప్రాతూరు జోషి, ప్రాతూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే పరిపూర్ణత

డాక్టర్ సాయి ప్రసాద్ - ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరిట్ ప్రోత్సాహకాలు అందజేత



హై స్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు, విద్యార్థులకు మెరిట్ ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న డాక్టర్ సాయి ప్రసాద్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విద్యార్థులు చిన్ననాటి నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడం, క్రమశిక్షణతో మెలగడం ద్వారా పరిపూర్ణమైన విద్యార్థిగా తయారు కావచ్చునని చదువుతో పాటు సామాజిక స్పృహ, వివిధ అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలనీ ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ తెలిపారు. మండలంలోని చినకాకాని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉన్నత శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు మెరిట్ ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. సింహాద్రి బసవపున్నయ్య జయంతి సందర్భంగా కామ్రేడ్ సింహాద్రి శివారెడ్డి, బసవపున్నయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డాక్టర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు తో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఇటువంటి ప్రోత్సాకాలను మరింత మంది విద్యార్థులు అందుకునేలా పోటీ పడాలన్నారు. పదవ తరగతి ఫలితాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను గురువులను గౌరవించాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి. రామారావు, గ్రామ పెద్దలు పల్లబోతుల శ్రీనివాసరావు, గాదె పిచ్చిరెడ్డిలు మాట్లాడారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రథమ ద్వితీయ తఅతీయ స్థానాలలో నిలిచిన ఎం.కార్తీక్‌రెడ్డి, ఎం.జాయ్‌బ్లెస్సి, గండికోట లక్ష్మీ ప్రియలకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి. నాగేశ్వరరావు, సురేష్, ట్రస్ట్ వ్యవస్థాపకులు సింహాద్రి ఆదిశేఖర్, నిర్మల, ప్రజా సంఘాల నాయకులు బి.కోటేశ్వరి, గండికోట బాబు వరప్రసాద్, అప్పికట్ల ప్రకాశరావు, గోపాల రెడ్డి, వెంకట్రామయ్య, మేడ శివయ్య, సింహాద్రి సుమ, రత్న, ఈదా శిఖర, డి.నరసింహారావు పాల్గొన్నారు.

క్లినిక్ ప్రారంభం

కాజా గ్రామంలో సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద నామమాత్రపు ఫీజులుతో నూతనంగా ఏర్పాటు చేసిన క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. పేదలకు అతి తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ రామిరెడ్డి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఈ క్లినిక్ ను ప్రారంభించారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రజకులలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్రవ్యాప్తంగా రజకులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు విధివిగా జరుగుతున్నయని, వాటి నివారణకు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలు అమలు కొరకై జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో రజక ఉద్యోగ, రజక యువత, కార్మిక వృత్తిదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం రజక వృత్తిదారుల సంఘం మంగళగిరి - తాడేపల్లి నగర కమిటీ అధ్యక్షులు ఉండవల్లి పార్ధసారథి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కరపత్రాలును ఎంటిఎంసి పరిధిలోని పట్టణాలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఆదరణ పథకం ద్వారా రజకులకు వృత్తి పరికరాలు మంజూరు చేయాలని, 50 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి రజక



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, పట్టణ/ నగర ప్రాంతాలలో లాండ్రీ వృత్తి చేసుకున్న వారికి నెలకు 250 యూనిట్లు ఉచిత కరెంటు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, మంగళగిరి తాడేపల్లి నగర కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, తాడేపల్లి సాంబశివరావు, తుమ్మపూడి శివయ్య ,ఎం నరసింహారావు, కొడాలి శ్రీనివాసరావు, బాల వెంకయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వోకేషనల్ కోర్సులు

ప్రజాశక్తి - తాడేపల్లి

పెనుమాక వందేమాతరం హైస్కూల్‌లో వోకేషనల్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.అనంతశివ సోమవారం తెలిపారు. విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో ఈ కోర్సులు బోధించడానికి ఉపాధ్యాయులు జి.రాఘవేంద్ర, ఎన్.సుమన్‌లను నియమించినట్టు తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించి ల్యాబ్ ఎక్యూప్మెంట్‌ను అందుబాటులోకి ఉంచినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.





దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

230వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 23వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణలు ప్రారంభించారు. దీక్షల్లో వేముల లక్ష్మి, సారమ్మ, డి.మల్లేశ్వరి, హిమాంబి కూర్చున్నారు. ఈ సందర్భంగా కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మికులు ఎప్పటి వరకు ఐక్యంగా ఉండి ఎంతో పట్టుదలగా కార్యక్రమం కొనసాగించడం పట్ల అభినందనలు తెలిపారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, నాగేశ్వరరావు, దుర్గా భవాని, సాంబయ్య, సుబ్బారావు, ఆషిక్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో కృత్రిమమేదోశక్తి ప్రపంచాన్ని శాసిస్తుంది

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రానున్న రోజుల్లో కృత్రిమ మేధోశక్తి ప్రపంచాన్ని శాసిస్తుంది అని విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ పోలీస్ రవికుమార్ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడులో గ్రంధి సుబ్బారావు లక్ష్మి నరసమ్మ జిల్లాపరిషత్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం (మేరా యువ భారత్) సహకారంతో "ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ" వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో కనపడని శక్తి ఉంటుందని, దాన్ని బయటకు తీసి మీ కలల్ని నిజం చేసుకోవాలని, పుస్తకాలలో మాత్రమే జ్ఞానం ఉంటుందని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు మరియు ఆలోచనలకు దూరంగా ఉండాలని, విద్య అనే రెండక్షరాలు మీ జీవితాన్ని మారుస్తుందని, తల్లిదండ్రుల ఎడల జీవితాంతం గౌరవభావం కలిగి ఉండాలని అన్నారు. విశ్రాంత జి.ఎస్.టి కమిషనర్ బి.రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుతో పాటుగా విద్యార్థులు ప్రతి విద్యార్థి ఏదో ఒక స్కిల్ కలిగి ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ల్యాంప్ సంస్థ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రిఫ్రిజిరేటర్ అందజేస్తున్న దృశ్యం

చైల్డ్ హోమ్‌కు రిఫ్రిజిరేటర్ బహూకరణ

ప్రజాశక్తి - పొన్నూరు

పోలుదాసు నాగార్జునారావు, వారి ధర్మపత్ని నాగ మల్లేశ్వరమ్మ జ్ఞాపకార్థం బ్రాహ్మణ కోడూరులోని చైల్డ్ హోమ్‌కు సోమవారం రిఫ్రిజిరేటర్ కుటుంబ సభ్యులు బహుమతిగా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ప్రదీప్తి, శ్రీకాంత్, చైత్ర, సుజిత్, సుమలత నాగరాజు, లాస్య వారికి మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ కార్యదర్శి గుడివాడ పవన్ ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయ్ కుమార్ చైల్డ్ హుమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో
గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజిలో ఖాళీగా ఉన్న గణితం, రసాయన శాస్త్రం అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేయటానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల ఎంపిక డెమో ప్రక్రియ ద్వారా జరుగుతుందన్నారు. అభ్యర్థులు వారి సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 26వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

వర్షం సమస్యలపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి-గుంటూరు



శ్రీనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటు న్నామని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే గుంటూరు నగరపాలక సంస్థలో 24 గంటలూ అందు బాటులో ఉండేలా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 0863-2345103కు సమాచారం ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం శ్రీనగర్, పిఎస్.నగర్, బొంగరాలబీడు ప్రాంతాల్లో పర్యటించి, వర్షప్రభావం వలన ప్రజలకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా జనరెటర్లను సిద్దం చేసుకోవడం, క్లోరిన్, ఆలం తగిన మోతాదులో ఉండేలా శ్యాంపిల్స్ సేకరణ చేయాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు డ్రైన్లలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించడానికి కార్మికులను కేటాయించుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిఈఈ కళ్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డొంకరోడ్డు వద్ద వాహనదారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని డొంకరోడ్డు వద్ద రూ.13 కోట్లతో నిర్మించిన మూడు వంతెనల మార్గంలో సోమవారం రాత్రి వర్షం నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలకు వర్షం నీరు ఆటంకంగా ఉండటంతో కొంత మంది ద్విచక్ర వాహనదారులు వాహనం దిగి నడిపించుకుంటూ ముందుకు వెళ్లారు. రైల్వే శాఖ రూ.13 కోట్లు ఖర్చు చేసినా వంతెన దిగువ భాగంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడటంలో విఫలమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ, రైల్వేశాఖల మధ్య సమన్వయం లోపం వల్ల ముంపు సమస్య పరిష్కారం కాలేదంటున్నారు.

ఈత పోటీల్లో కెఎల్‌పి విద్యార్థికి స్వర్ణాలు

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థిని అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ అండర్ 17 ఈత పోటీలలో స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎస్.కార్తికేయ ఐదు విభాగాలలో సత్తా చాటి స్వర్ణపతకాలు సాధించినట్లు పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం కార్తికేయను సెక్రెటరీ అభినందించారు. ఆగస్టు 2 నుండి 7వ తేదీ వరకూ అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడన్నారు. కార్తికేయను అభినందించిన వారిలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తదితరులున్నారు.

బ్యాడ్మింటన్‌లో సుమేధా స్కూల్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు



సాయి అక్షరను అభినందిస్తున్న సాయిఅక్షర

స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 52వ జిల్లా బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అండర్ 11, అండర్ 13 గరల్స్ విభాగం సింగిల్స్, డబుల్స్ విభాగంలో సుమేధా విద్యార్థి సంకట సాయిఅక్షర మొదటి బహుమతి సాధించిందని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో సాయి అక్షరను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు.. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.రాంబాబు, పిఇటి కిరణ్‌రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తతకు నరెడ్కో అంగీకారం

ప్రజాశక్తి-గుంటూరు

పి4 కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన నరెడ్కో కమిటికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. సోమవారం నరెడ్కో గుంటూరు కమిటి జిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో పి4పై ప్రత్యేక సమావేశం జరిగింది.గుంటూరు నగరంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరిన వెంటనే నరెడ్కో కమిటి సానుకూలంగా స్పదించారన్నారు. త్వరలో వారి కమిటి సమావేశం ఏర్పాటు చేసుకొని దత్తత నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. సమావేశంలో నరెడ్కో గుంటూరు ప్రెసిడెంట్ కెసిహెచ్.అంకారావు, సెక్రెటరి ఎం.శ్రీనివాస్, ట్రెజరర్ కె.చిన్న తిరుపతయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు భారీగా అర్జీలు

పలువురు అధికారులకు షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు



కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు అర్జీలు వెల్లువెత్తాయి. క్రమంగా అర్జీల సంఖ్య పెరుగుతుంది. సమస్యలు పరిష్కారం కాకపోవటంతో అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్నపుడు ఎన్ని అర్జీలు వచ్చేయో ఇప్పుడు కూడా అదే స్థాయిలో వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, ఎస్.సి.కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, డిఆర్‌ఓ ఖాజావలి, ప్రజల నుండి 368 పిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి వెళ్లకుండా చూడాలని కోరారు. నిర్లక్ష్యంగా ఉండే వారికి షోకాజు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. వట్టి చెరుకూరు మండల సర్వేయర్, తెనాలి డిఎల్‌డిఓకు వచ్చిన అర్జీలు బియండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్ళాయని వాటిపై వివరణ కోరుతూ సంబంధిత మండల అధికారులకు షోకాజ్ నోటీస్ లు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ జ్యోతిబాసు, హౌసింగ్ పి.డి ప్రసాద్, డిఆర్‌డిఏ. పి.డి. విజయలక్ష్మి, సి.పి.ఓ. శేషశ్రీ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..



తాడేపల్లి పట్టణంలో క్రొత్తూరు రైల్వేగేటు సమీపంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటూ తొలగింపునకు గురైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ బాధితులు సిపియం నాయకులతో కలిసి అర్జీ అందచేశారు. 2009లో రైల్వే వారు మా నివాసాలను తొలగించారని, అప్పటి ప్రభుత్వ అధికారులు మీకు ఇంటి స్థలాలు ఇస్తామని వాగ్ధానం చేశారన్నార. అప్పటి నుండి అనేకసార్లు ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చినా స్థలాలు ఇవ్వలేదన్నారు. అప్పటి నుండి అద్దెలు కట్టలేక పక్కనే ఉన్న ఈఐడి ప్యారీ కంపెనీ ఆవరణలో తాత్కాలిక నివాసం ఉంటున్నామని, అయితే స్థల యజమాని ఖాళీ చేయమని చెప్పారన్నారు. దీంతో ఆరు నెలల క్రితం గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చామని, ఇంత వరకూ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మరోవైపు స్థల యజమానిని నుండి ఒత్తిడి ఎక్కువైందన్నారు. కావున పేదలకు నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో సిపియం నాయకులు శ్రీనివాసకుమారి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, బాధితులు నాగలక్ష్మి, షేక్.రమీజా, కృష్ణకుమారి, తదితరులున్నారు.

హాస్టల్‌ను తరలించొద్దు..



నగరంపాలెంలో దర్గా వద్ద ఉన్న కాలేజి బాలుర వసతి గృహాన్ని ఎటి అగ్రహారం 13వ లైన్‌కు తరలించటం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బంది పడతామని, కావున తరలించొద్దని కోరుతూ విద్యార్థులు అర్జీ అందచేశారు. గత 20 సంవత్సరాలుగా దర్గా వద్ద ఉన్న ప్రేవేట భవనంలోనే హాస్టల్ కొనసాగుతుందన్నారు. సమీపంలోని కాలేజీల్లో చేరి, సులభంగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నామని, ఇప్పుడు హాస్టల్ మారిస్తే కాలేజిలకు దూరం అవుతుందని, మాపై రవాణా ఛార్జీలు భారం పడుతుందన్నారు. అంతా పేద విద్యార్థులమని, ఛార్జీలు భరించలేమన్నారు. కావున హాస్టల్ భవనాన్ని తరలించొద్దని కోరారు.



15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



గతేడాది డిసెంబర్‌లో కేంద్రం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను తక్షణం పంచాయతీలకు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు సర్పంచ్‌లు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు దష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యం వాపోయారు. పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని, కావున తక్షణమే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరారు. మరోవైపు ఈ ఏడాది జులైలో కేంద్రం ఇవ్వాల్సిన వెయ్యి కోట్ల రూపాయలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. గత సంవత్సరం పంపిన నిధులకు ఉపయోగిత సర్టిఫికెట్లు పంపిస్తేనే కేంద్రం నుండి ఏడాది రావాల్సిన నిధులు వస్తాయన్నారు. కావున రూ.1121 కోట్లు విడుదల చేయాలని కోరారు. అలాగే రిజిస్ట్రేషన్ సర్ చార్జీలు చెల్లించాలని, పెండింగ్ గౌరవ వేతనాలు విడుదల చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మంచాల సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు, కాట్రపాడు సర్పంచ్ మేదరమెట్ల శివశంకర్, వెంగలాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలిత కుమారి, మేడికొండూరు సర్పంచ్ పూల నాగమణి , జొన్నలగడ్డ సర్పంచ్ మబ్బు శిరీష సుధాకర్ తదితరులు ఉన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలి..

గత ఐదు నెలలుగా నిలుపుదల చేసిన వికలాంగ పింఛన్లు పునరుద్ధరించాలని కోరుతూ పత్తిపాడు మండలం, కొండేపాడు గ్రామానికి చెందిన పచ్చల శ్రీనివాసరావు, చుండూరు సాంబశివరావు, గొల్లపూడి వేణుగోపాల ప్రసాద్ అర్జీ అందచేశారు. తాము గ్రామంలో నివశించట్లేదని తప్పుడు నివేదికలతో ఎంపిడిఓ పెన్షన్ నిలుపుదల చేశారన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపిపి, విఆర్ఓ, అంగన్‌వాడీలు, ఇతర అధికారులు అందరూ తాము గ్రామంలోనే ఉంటున్నట్లు సంతకాలు చేశారన్నారు. కానీ పంచాయతీ సెక్రెటతో బలవంతంగా తప్పుడు నివేదిక రాయించి పెన్షన్ నిలుపుదల చేశారన్నారు. కావున తమకు పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు తొలగించాలి...

మేడికొండూరు నుండి 113 తాళ్లూరు వరకూ ఉన్న డొంకను విస్తరించి నిర్మిస్తున్న రోడ్డును పూర్తి చేయాలని కోరుతూ మేడికొండూ రుకు చెందిన నర్రా సతీష్ అర్జీ అందచేశారు. రోడ్డు నిర్మాణానికి రైతులు అందరూ కొంత భూమి ఇచ్చి సహకరిస్తున్నామన్నారు. మన్నవ శివరామయ్య, వారి కుమారుడు వెంకట నరసయ్య రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఇబ్బంది పెడుతూ, తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. రోడ్డు పని సాగనివ్వకుండా అధికారులకు అర్జీలు పెడుతూ రోడ్డు పని సాగనివ్వట్లేదన్నారు.కావున ఈ విషయాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కౌలు రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ ఉన్నారు.

కమిషనర్ పిజిఆర్‌ఎస్‌లో ఐదుఅర్జీలు

ప్రజాశక్తి తెనాలి : ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం పురపాలక సంఘ కార్యాల యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు స్వీకరించినట్లు కమిషనర్ వి లక్ష్మీపతిరావు వెల్లడించారు. ఇంజనీరింగ్, శానిటరీ విభాగాలకు సంబంధించి రెండు చొప్పున, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక అర్జీ దాఖలు అయినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో : సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 14 అర్జీలు దాఖలు అయ్యాయి. అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి, మిగిలినవి ఇతర అంశాలకు సంబంధించి దాఖలయ్యాయి. అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ సంజనా సింహ వెల్లడించారు.